ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వరంగల్
ఆదివారం 18 ఆగస్టు 2024

తయ్యం.. తత్తయ్యం..

..హే.. బాపు బంజారులం

- చెక్కు చెదరని లంబాడాల కట్టు, బొట్టు
- నాడు తండాల సంప్రదాయం.. నేడిదే ట్రెండ్

Sunday SPECIAL

7





సమాజంలో లంబాడా మహిళలది భిన్నమైన వస్త్రధారణ.. ఆ ప్రత్యేకమైన అలంకరణే వారి సౌందర్యం. రంగురంగుల అద్దాలు పొదిగిన రవికలు.. అవే రంగులు.. అద్దాలతో ఉన్న దుప్పట్టా.. మణికట్టు నుంచి మోచేతివరకు మందపాటి తెలుపురంగు గాజులు, చెవులకు పెద్దపెద్ద వెండి దిద్దులు.. మెడలో వెండి గొలుసులు, పాత రూపాయి నాణేలతో చేసిన హారాలు, కాళ్లకు వెండి కడియాలు, గజ్జెలు ధరించడం వారి సంప్రదాయం. అదే వారి సోయగం. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలగలిసిన వేషధారణలో ఆ మహిళలు నడిచొస్తున్నా.. పాదం కదిపి జానపదానికి నృత్యం చేసినా ఆ గజ్జెల సవ్వడి వినసొంపుగా ఉంటుంది. ఇదంతా ఒకప్పటి మాట. ఆధునిక పోకడల్లో క్రమంగా ఈ వేషధారణలో కొంత మార్పులొచ్చాయి. ఈ తరం లంబాడా మహిళలు కూడా ఈ వస్త్రధారణపట్ల ఆసక్తి చూపని పరిస్థితులు. కానీ ట్రెండ్ మారుతోంది. మళ్లీ లంబాడా వస్త్రధారణవైపు దృష్టి మళ్లుతోంది. 'పాతకు సలాం.. ఇదే మా నయా ట్రెండ్' అంటూ గిరిజన మహిళలు తమ సంప్రదాయ దుస్తులు ధరించడం.. వేడుకలకు హాజరవడం కనిపిస్తోంది. అంతేకాదు ఫ్యాషన్ షోలతో పాటు వేడుకల్లో ఈ అలంకరణలు జిగేల్ మంటున్నాయి.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్

'భద్రకాళి' ఆదాయం రూ.6.55లక్షలు



వరంగల్ కల్చరల్, ఆగస్టు 17: శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతం రోజున భద్రకాళి అమ్మవారికి రూ.6,55,446 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో శేషు భారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకరోజు పూజా టికెట్లు, ప్రసాదాలు, ప్రత్యేక దర్శనం ద్వారా ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. అత్యధికంగా పూజలు టికెట్లు, ప్రసాదాలు విక్రయించడం ద్వారా లభించినట్లు పేర్కొన్నారు.

నగరంలో కీర్తిసురేష్

'జోస్ అలుక్కాస్' ప్రారంభానికి హాజరు

బాలనటిగా.. ఆ తర్వాత హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని.. తెలుగుతో పాటు పలు భాషల్లో నటిస్తూ అలరిస్తున్న 'మహానటి' కీర్తిసురేష్ నగరంలో శనివారం సందడి చేశారు. హనుమకొండలోని నక్కలగుట్టలో ఏర్పాటైన జోస్ అలుక్కాస్ బంగారు ఆభరణాల షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, జోస్‌అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కా, పాల్ జే, అలుక్కా, జాన్ అలుక్కా తదితరులు పాల్గొన్నారు.

- కాళోజీ జంక్షన్



పోడు భూముల రక్షణకు కృషి

వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 17: పోడు రైతుల ప్రయోజనాలు, ఉపాధికి భంగం కలగకుండా, పోడు భూముల రక్షణకు కృషి చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఆమోదించిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ దరఖాస్తుల పట్టాలు లబ్ధిదారులకు చేరిన వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు లు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సాగు అవుతున్న అటవీ భూ ముల వివరాలతో కూడిన నివేదిక అటవీ, గిరిజన శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని స్పష్టం చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజ నులకు అటవీశాఖ వ్యతిరేకం అనే భావన తొలగించేలా పనిచేయాల న్నారు. అడవుల నరికివేత జరగకుండా అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అటవీ భూము లు, చెట్లు నరికివేతతో కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అటవీ భూముల్లో స్మగ్లింగ్ జరగకుండా పక్కా నిఘా ఏర్పాటు కావాలని మంత్రి ఆదేశించారు.

18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పి.సుదర్శన్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 17: ఓటరు జాబితాలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి జాబితాలో చోటు కల్పించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పి.సుదర్శన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి అదనపు సీఈవో లోకేష్ కుమార్‌తో కలిసి ఓటరు జాబితా సవరణ 2025పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 2025 జనవరి 1 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. మరణించిన ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటరు జాబితా ఫారం 7 ద్వారా తొలగించాలని సూచించారు. 1500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను క్రమబద్ధీకరించాలని, అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన సమర్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్ఓ అగర్వాల్, ఆర్డీవో కృష్ణవేణి, డీటీడీవో సౌజన్య పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి

వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సీపీ

శంభునిపేట, ఆగస్టు 17 : పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని, న్యాయం జరుగుతుందని పోలీసులపై నమ్మకంతో వచ్చే వారికి నిబద్ధతతో పని చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మామునూరు పోలీసు డివిజన్ (ఏసీపీ) కార్యాలయాన్ని శనివారం సీపీ తనిఖీ చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ రవీందర్‌లు సీపీకి మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఏసీపీ కార్యాలయంలోని రికార్డులను సీపీ పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న పెండింగ్ కేసుల వివరాలు, నేరస్తులు, అరెస్టులు, కేసుల స్థితిగతులపై ఏసీపీ తిరుపతిని అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని పోలీసు ఎస్‌హెచ్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదని సీపీ హెచ్చరించారు. ప్రజలు పోలీసులపై పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్టుగా పనిచేయాలని, డయల్ 100 నుంచి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించాలని సీపీ స్పష్టం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆవరణలో మొక్కను నాటారు. కార్యాలయంలో పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణంపై సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతిలతోపాటు మామునూరు, గీసుకొండ, ఏనుమాముల, పర్వతగిరి సీఐలు రవికుమార్, బాబులాల్, రాఘవేందర్, రాజగోపాల్‌లు, సంగెం, పర్వతగిరి, ఐనవోలు ఎస్‌ఐలు నరేష్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్.. మరిచెన్..

- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు
- మంజూరుపై వెలువడని ప్రభుత్వ ప్రకటన
- ఆదేశాలు రాలేదంటున్న అధికారులు



వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 17: ఆసరా పింఛన్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పేరును చేయూతగా మార్చింది. అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా పింఛన్లపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేసున్నారు. సుమారు రెండున్నర సంవత్సరాల నుంచి నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా అధిక సంఖ్యలో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ మంజూరుకు మాత్రం నోచుకోవడం లేదు. చాలా మంది ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించి ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో 1,25,049 మంది పింఛన్ పొందుతుండగా వీరికి ప్రతినెలా రూ. 29.14 కోట్లు ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.

వెలువడని ప్రకటన

గతంలో ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేసే విధానం అమలులో ఉండేది. రెండు సంవత్సరాలుగా పింఛన్లపై మంజూరుపై ఎలాంటి ప్రకటన రావడం లేదు. ప్రతీ నెలా అర్హులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటి కప్పుడు విచారణ చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పక్కన పెడుతున్నారు. ఈ నెలలోనే నూతన పింఛన్ ప్రక్రియ మొదలవుతుందని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరు ఆసరా పింఛన్ పొందుతూ మరణిస్తే ఆ పింఛన్‌ను భాగస్వామికి బదిలీ చేస్తున్నారు. పోయిన సంవత్సరం నుంచే స్పౌజ్ పింఛన్ల ప్రక్రియ కొనసాగుతోంది. స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలోనే పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. జిల్లాలో 1,25,049 మంది వివిధ రకాల పింఛన్ పొందున్నారు. వీరికి ప్రతినెలా రూ. 29.14 కోట్లు ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.

జిల్లాలో పింఛన్ దారులు

వృద్ధాప్య	47694
వితంతు	47,092
వికలాంగులు	15,689
చేనేత	2,299
గీత కార్మికులు	2,895
బీడీ కార్మికులు	5,695
ఒంటరి మహిళ	3,202
ఫైలేరియా బాధితులు	326
డయాలసిస్ బాధితులు	141

ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు

కౌసల్యాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

కొత్త పింఛన్ల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇప్పటి వరకు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారమే పింఛన్ల మంజూరు చేయడం జరుగుతుంది. చేయూత పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి ప్రభుత్వం నివేదికను ఎప్పటికప్పుడు అందజేస్తున్నాం.

బీఆర్‌ఎస్ నాయకులకు అండగా ఉంటా

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మట్టెవాడ, ఆగస్టు 17: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గ్రేటర్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, నాయకులు తుమికి రమేశ్‌బాబు, సయ్యద్ మసూద్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సిద్దం రాజు, రాధికారెడ్డి, చిన్న మధుకిరణ్ పాల్గొన్నారు.




కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే నరేందర్



హనుమకొండ నక్కలగుట్టలో జోస్ అలుక్కాస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అట్టహాసంగా 'జోస్ అలుక్కాస్' ప్రారంభం

కాళోజీ జంక్షన్, ఆగస్టు 17: బంగారు ఆభరణాల విక్రయాల్లో రిటైల్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన జోస్ అలుక్కాస్ హనుమకొండలోని నక్కలగుట్టలో సరికొత్త షోరూమ్‌ను శనివారం ప్రారంభించింది. షోరూమ్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొనగా, సినీ నటి కీర్తిసురేష్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వేడుకలో జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కా, పాల్ జే, అలుక్కా, జాన్ అలుక్కా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం నాటి నుంచి ఈ నెల 21 వరకు రూ.60వేల విలువైన బంగారు, వజ్రాభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రోత్సాహకంగా ఒక బంగారు నాణాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ఇంకా అదనంగా వజ్రాలపైన 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపైన 7 శాతం తగ్గింపును నిర్వాహకులు ప్రకటించారు. షోరూమ్‌లో ప్రతీ ఆభరణం కొనుగోలుతో ఒక బహుమతిని కూడా అందజేస్తున్నారు. అలాగే వివాహ ఆభరణాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపులు చేయనున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జోస్ అలుక్కా మాట్లాడుతూ.. షోరూమ్‌లో విస్తృతమైన, ఆకర్షణీయమైన కలెక్షన్లతో నింపినట్లు వివరించారు. కస్టమర్లు హాల్‌మార్క్ కలిగిన పాత బంగారాన్ని కొత్త బంగారు ఆభరణాలతో మార్పిడి చేసుకొని వాటితో లభించే లాభాలను పొందాలన్నారు. ఇక్కడ బంగారం, వజ్రాలు, వెండి, ప్లాటినం, కలెక్షన్లు, అత్యాధునిక డిజైన్లు లభ్యమవుతాయని అన్నారు. కాగా,60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆరు ఎంజీ ఆస్టర్, కార్లు, గృహోపకరణాలు, బంగారునాణాలతో సహా సుమారు రూ.6కోట్ల బహుమతులను ప్రకటించింది.



'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ హరీష్‌కు జాతీయ అవార్డు



హనుమకొండ టౌన్, ఆగస్టు 17: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ -2024 పోటీల్లో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ వీరగోని హరీష్‌కు బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 500 ఎంట్రీలు రాగా, వీరగోని హరీష్ తీసిన వరం గల్ వేయిస్తంభాల ఆలయం ఫొటోకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా హరీష్‌ను 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, బ్యూరో చీఫ్ తడక రాజనారాయణ, తదితరులు అభినందించారు.

తయ్యం.. తత్తయ్యం..

చెక్కు చెదరని లంబాడాల కట్టు, బొట్టు నాడు తండాల సంప్రదాయం.. నేడిదే ట్రెండ్

..హే.. బాపు బంజారులం..



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 17 : 'తయ్యం..తత్తయ్యం.. తయ్యం.. తత్తయ్యం... హే... బాపు బంజారులం..' ఈ జానపద గేయం తెలంగాణ ప్రతీ పల్లెలో మారుమోగుతూ ఉంటుంది. ప్రధానంగా గిరిజన ప్రాబల్య ప్రాంతాలతో పాటు గిరిజనేతర ప్రాంతాల్లోనూ జోష్ నింపే ఈ జానపద గేయాన్ని పాఠశాలలు, కళాశాలల వార్షికోత్సవాలే కాదు.. ప్రతీ కార్యక్రమంలోనూ ఈ సంప్రదాయ నృత్యం చేస్తూ కనిపిస్తుంటారు. బంజార సంప్రదాయ దుస్తులు ధరించిన పిల్లలు.. మహిళలు పాదం కదుపుతారు. అయితే ఇక్కడో ప్రత్యేకత ఉంది. వీరు ధరించే దుస్తులు, ఆభరణాలు పూర్వకాల బంజారాల సంప్రదాయానివే అయినా ప్రస్తుతం అవి నయా ట్రెండ్‌గా.. పార్టీవేర్ దుస్తులుగా మారిపోతున్నాయి. ఫ్యాషన్ షోలతో పాటు పార్టీల్లో ఈ అలంకరణలు, దుస్తులు అందరినీ అలరిస్తున్నాయి. ఇలా చెక్కుచెదరని బంజారా సంప్రదాయ వైభవంపై ఆదివారం ప్రత్యేక కథనం.

అనేక రంగులు.. హంగులు..

రంగురంగుల అద్దాల రవిక, అవే రంగులు.. నెత్తిన అద్దాలు పొదిగిన దుప్పట్టా లాంటి వస్త్రం, మణికట్టు నుంచి మోచేతివరకు ప్రత్యేకంగా తయారు చేసిన మందపాటి గాజులు, చెవ్వులకు పెద్దపెద్ద వెండి దిద్దులు..... మెడలో వెండి గొలుసులు....అదే స్థాయిలో పాత రూపాయి నాణేలతో తయారు చేసిన గొలుసులు ధరించడం లంబాడా మహిళల సోయగం. ఈ వేషధారణలో లంబాడా మహిళలు నడుస్తున్నా.. పాదం కదిపి ఆడినా గజ్జెల సవ్వడి శబ్దం వినసొంపుగా ఉంటుంది. ఇదంతా ఒకప్పటి మాటే. ఆధునిక పోకడల్లో కొంత మార్పు చోటు చేసుకున్నా.. మళ్లీ 'పాతకు సలాం' అంటూ ఈ సంప్రదాయ అలంకరణలు నయా ట్రెండ్‌గా మారుతున్నాయి. లంబాడా మహిళలు తమ సంప్రదాయ దుస్తులను ధరించి వివాహ, ఇతర వేడుకల్లో పాల్గొనడం మళ్లీ పెరుగుతోంది.

ఈ ట్రెండ్ వ్యాపారానికి డిమాండే...

లంబాడాల సంప్రదాయ దుస్తులు, అలంకరణ వస్తువులు ప్రత్యేకంగా తయారు చేసి విక్రయించే వ్యాపారానికి మళ్లీ డిమాండ్ వచ్చేస్తోంది. ఒకప్పుడు దుస్తులను పట్కారోలుగా వ్యవహరించే బీసీ వర్గానికి చెందిన కొందరు మాత్రమే తయారు చేసేవారు. నయా ట్రెండ్‌గా దీనికి మార్కెట్ పెరుగుతుండడంతో అన్నివర్గాల వారు ఈ దిశగా దుస్తుల తయారీకి ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల వార్షికోత్సవాలు, గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జానపద నృత్యాలు చేసే కళాబృందాలు, ఫ్యాషన్ షోల సందర్భంగా వీటికి గిరాకీ ఉంటోంది.

సంప్రదాయ దుస్తులివే..

ప్రధానంగా సంప్రదాయ దుస్తులు, వస్తువులో కాండ్లీ(జాకెట్), పాట (ముసుగు), కడపాలు, గాజులకు ముందు వేసే చలియా, బేగార్లు, వంకిడీలు, బలియాలు, కాంట్లీగుగ్గురా, చట్కియా (మట్టెలు), కస్సె, కాలిగజ్జెలు, గజ్జెల లాగులు లభిస్తున్నాయి.

దుస్తులు, రేట్లు....

కాండ్లీ జాకెట్లు రూ.1000, పాట రూ.450, కడపాప్లైన్ రూ.100, 12గాజులకు రూ.200, వాంకిడీ జత రూ.1000, కాంట్లీగుగ్గురా ఒక్కటికి రూ.20, చట్కియా (మట్టెలు) రూ.150, కస్సె జత రూ.800, కాలిగజ్జెలు జత రూ.800పైగా, గజ్జెల లాగులు రూ.2000, అంగూతర పెద్దవేలు మట్టెలు రూ.160 ఉన్నాయి.

ప్రోత్సహిస్తే మా కుటుంబాలకు జీవనోపాధి

ఎ. మదన్, లంబాడా గాజుల వ్యాపారి, మహబూబాబాద్



ఒకప్పుడు బాగానే నడిచిన లంబాడా గిరిజనులు సాంప్రదాయ దుస్తుల వాడకం క్రమంగా తగ్గింది. కానీ ఇప్పుడిప్పుడే కాస్త పుంజుకుంటోంది. అత్యధికంగా గిరిజనులు ఉండే మానుకోట ప్రాంతంలో ఒకప్పుడు 15 షాపుల్లో కేవలం గిరిజన సంప్రదాయ దుస్తులనే విక్రయించే వారు. రానురాను గిరిజన దుస్తులపై మోజు తగ్గడమో.. పాశ్చాత్య దుస్తులపై వ్యామోహం పెరగడమో గిరిజన సాంప్రదాయ దుస్తులను కొనుగోలు చేసే వారు తక్కువయ్యారు. అయినా ఇప్పుడు కొత్త ట్రెండ్‌గా ఈ దుస్తులను కోరుతూ.. రావడం మా వృత్తికి ఆశాజనకం. సంప్రదాయ దుస్తుల తయారీకి ప్రభుత్వం ప్రోత్సహిస్తే మా జీవనోపాధి మెరుగుపడుతుంది.

శైలజకు జేఎన్‌టీయూ డాక్టరేట్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 17: వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పోకల శైలజకు జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రొఫెసర్ గురురావు పర్యవేక్షణలో నావెల్ సెక్యూటర్ మల్టీ పాత్ రోటింగ్ అల్గారితమ్ ఫర్ మొబైల్ అడ్‌హక్ నెట్‌వర్క్ అనే అంశంపై శైలజ సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు జేఎన్‌టీయూ డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.



బైక్ ఢీకొని వ్యక్తి మృతి



సదయ్య(ఫైల్)

సంగెం, ఆగస్టు 17: బైక్ ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన తీగరాజుపల్లిలో శనివారం జరిగింది. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సూత్రపు సదయ్య(55) తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించుకునేందుకు బంక్ వద్దకు వెళ్తున్నాడు. అదేసమయంలో వరంగల్‌లోని కరీమాబాద్‌కు చెందిన కొక్కొండ నిఖిల్ వరంగల్ వైపు వెళ్తూ తన ద్విచక్రవాహనంతో వెనకనుంచి వేగంగా వచ్చి సదయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో సదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సదయ్య సెలూన్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళా మోర్చా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



పోచమ్మమైదాన్‌లో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

మిల్స్‌కాలనీ, ఆగస్టు 17: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం, హత్యను నిరసిస్తూ శనివారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని మాట్లాడారు. మహిళా డాక్టర్‌పై జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. సంఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప, మహిళా మోర్చా నాయకులు, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని న్యూడెమోక్రసీ నాయకులు అక్కడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఖిలావరంగల్ అమరవీరుల స్థూపం వద్ద న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వత్తుల ద్వారా నివాళులర్పించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కేంద్ర దర్యాప్తు సంస్థ దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్, న్యూడెమోక్రసీ జిల్లానాయకులు బండి కోటేశ్వర్‌రావు, రావుల బాలరాజు, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా నాయకులు రంజిత్, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర జయబాబు, బన్న నర్సింగం, రమేష్, పుప్పాల రవిందర్, ఇనుముల కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.



ఖిలావరంగల్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్డీ నాయకులు



సీకేఎం ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

వైద్యుల నిరసన

• సీకేఎం ప్రసూతి, ఆయుర్వేద ఆస్పత్రుల్లో ఆందోళన

• ఓపీ సేవలకు అంతరాయం

గిర్మాజిపేట, ఆగస్టు 17: కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రి జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రులలో వైద్యులు శనివారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ వైద్యుల సంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తదితర వైద్య సంఘాల జాతీయ స్థాయి నిరసనలు, ఓపీ వైద్య సేవల బంద్‌లో భాగంగా సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. వైద్యుల విధుల బహిష్కరణతో అవుట్ పేషంట్ విభాగంలో వైద్య సేవలకు అంతరాయం కలిగింది. వివిధ ప్రాంతాల నుంచి వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు ఓపీ సేవలు లేవనే సమాచారంతో వెనుతిరిగిపోయారు.

దాదాపుగా అవుట్ పేషంట్ విభాగంలో స్కానింగ్ తదితర అన్ని రకాల సేవలకు అంతరాయం కలిగింది. అయితే నెలలు నిండిన గర్భిణులకు మాత్రమే లేబర్ రూం వద్ద విధుల్లో ఉన్న వైద్యులు అవసరమైన వైద్య సేవలు అందించారు. విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించిన వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్, అవుట్ సోర్సింగ్ తదితర అన్ని విభాగాల సిబ్బంది ఆస్పత్రిలో నిరసన ర్యాలీ చేపటారు. సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.షర్మిల మాట్లాడుతూ కలకత్తా జూనియర్ వైద్యురాలు హత్యాచార ఘటన అమానవీయమని, రోగుల ప్రాణాలు కాపాడే వైద్యురాలికి ఇలా జరగడం దారుణమన్నారు. వైద్యులకే రక్షణ లేకపోతే రోగులకు ఎలా వైద్యసేవలు అందుతాయని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ స్వర్ణసుధ, డాక్టర్ సువర్ణ, నర్సింగ్ అధికారులు, జూనియర్ వైద్యులు, పారా మెడికల్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే, ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీ ధరించి విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నిరసనలో సూపరింటెండెంట్ డాక్టర్ జి.పద్మావతి, ప్రొఫెసర్లు దుర్గాబాయి, నాగలక్ష్మి, కమలకుమారి, ఎస్.శ్రీధర్, కేదారి, మహేష్, సాంబమూర్తి, హరికిషన్, వెంకటరమణ, కార్యాలయ సూపరింటెండెంట్ పులిరాజు, ల్యాబ్ టెక్నీషియన్, జూడాలు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



ఎంజీఎంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ: కలకత్తాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీకి చెందిన జీపీ విద్యార్థిని హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో జూడాలు నిర్వహించిన నిరసనకు సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న కిరాతకులను కఠినంగా శిక్షించాలన్నారు. సంఘటన జరిగి ఇన్ని రోజులైన నిందితుడిపై చర్యలు తీసుకోకపోవడంపై అక్క డి ప్రభుత్వం ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, కోచ్‌లు

కరీమాబాద్, ఆగస్టు 17: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నగరంలోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన కివీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి శనివారం తెలిపారు. ఈనెల 11,12 తేదీల్లో మంచిర్యాల జిల్లా మందమర్రిలో బీఎంఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి తెలంగాణ, ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీల్లో కుమిటీ, కటాస్ విభాగంలో బంగారు, వెండి పతకాలు సాధించారన్నారు. ఎస్.వరుణ్, ఎం.యోజిత్, జే.లలిత్, సాత్విక్, జి.విష్ణువర్ధన్, ఇ.హర్షిత, బి.పావని, ఎం.డి.సోనమ్ పతకాలు సాధించారన్నారు. విజేతలను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, కరాటే, కిక్‌బాక్సింగ్ కోచ్‌లు బండారి సంతోష్, రణదీప్‌లు అభినందించారు.

న్యూ కౌటిల్యాస్‌లో రాఖీ వేడుకలు

కరీమాబాద్, ఆగస్టు 17: కరీమాబాద్ ప్రాంతంలోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హై స్కూల్లో శనివారం రాఖీ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కోడెం సబిత, కరస్పాండెంట్ కోడెం శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదర ప్రేమను చాటుకున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల ప్రాధాన్యం తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, యాజమాన్యం

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన 'కొండా'

గీసుగొండ, ఆగస్టు 17: వంచనగిరి గ్రామ మాజీ ఉప సర్పంచ్ పీసాల రాజేశ్వర్‌రావు రెండు రోజుల క్రితం మృతిచెందగా, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు శనివారం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట గోపాల నవీన్‌రాజ్, రడం భరత్, కొండా వెంకన్న, శ్రీను, రాజు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకుంటాం

శంభునిపేట, ఆగస్టు 17: డివిజన్‌లోని సమస్యలన్నింటిని పరిష్కరించుకుంటామని 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ అన్నారు. డివిజన్‌లోని లక్ష్మీపురంలో రోడ్డు బురదమయంగా ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. విషయాన్ని గమనించిన కార్పొరేటర్ విషయాన్ని స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే ఆదేశానుసారం శనివారం మెటల్ విడ్ మిక్స్‌తో తాత్కాలికంగా రోడ్డును వేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింగర్ కుమారస్వామి, వడ్డెపల్లి బాబు పాల్గొన్నారు.

మరియపురానికి అరుదైన గౌరవం

జాతీయ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎన్నిక

నేడు జూమ్ మీటింగ్‌లో పాల్గొనున్న మాజీ సర్పంచ్ బాలిరెడ్డి



బాలిరెడ్డి

గీసుగొండ, ఆగస్టు 17: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురానికి అరుదైన పురస్కారం లభించింది. 18న రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా తిరుపతిలో అకాడమి ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టడీస్ అండ్ రీసర్చ్ ఆఫ్ ఇండియా(అగ్రశ్రీ) జాతీయ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు గ్రామ మాజీ సర్పంచ్ బాలిరెడ్డి, గ్రామ కార్యదర్శికి ఆహ్వానం లభించింది. 21వ శతాబ్దంలో -జాతీయ గ్రామీణాభివృద్ధి భారతదేశ దార్శనికతపై పలువురు మేధావులు, వైస్ చాన్సలర్స్ నిట్ ప్రొఫెసర్‌లు, నిర్డ్ అధికారులు పాల్గొని వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని కేంద్ర పంచాయత్ రాజ్ శాఖ మంత్రి మణిశంకర్ అయ్యర్, సెంట్రల్ ప్లానింగ్ కమిటీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా హాజరై ప్రారంభోపన్యాసం ఇస్తారని చెప్పారు. జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించే ఈ సమావేశంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గ్రామాలను ఎంపిక చేయగా అందులో మరియపురం ఎన్నిక కావటం విశేషం. ఇందులో బాలిరెడ్డి అర్ధగంట గంటపాటు గ్రామాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, ఎదురైన సమస్యలు, సాధించే లక్ష్యాలు, 21వ శతాబ్దంలో గ్రామాల సాధికారత, స్థితిగతులు వంటి అంశాలపై ఆయన వివరించనున్నారు. ఆదివారం జరిగే అగ్రశ్రీ సమావేశం కొరకు గ్రామంలో భారీ డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.

యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూరజ్‌గౌడ్



పోచమ్మమైదాన్, ఆగస్టు 17: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన గొడిశాల సూరజ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్‌వీర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. గొడిశాల సూరజ్ గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

● జిల్లా నూతన కమిటీ నియామకం

మిల్స్‌కాలనీ: వరంగల్ బీజేపీ అనుబంధ బీజేవైఎంకు జిల్లా నూతన కమిటీని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా అచ్చ దయాకర్, రాపాక ప్రశాంత్, గొడిశాల సూరజ్‌గౌడ్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా పల్లకొండ శ్రీనివాస్, కొంకిస విగ్నేష్‌గౌడ్, ఆకాశ్ ఠాకూర్ సింగ్, బొజ్జ రంజిత్, కోశాధికారిగా చింతం అనిల్‌ను నియమించారు. వీరితో పాటు వరంగల్ ఈస్ట్ అసెంబ్లీ కన్వీనర్‌గా జి.కార్తీక్‌గౌడ్, నర్సంపేట కన్వీనర్‌గా ఆముదాల రమేష్, వర్ధన్నపేట కన్వీనర్‌గా చెంగల సురేష్, బీజేవైఎం స్పోర్ట్ కన్వీనర్‌గా మణికంఠను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

చౌటపెల్లి సొసైటీ సీఈవో సస్పెన్షన్

పర్వతగిరి, ఆగస్టు 17: మండలంలోని చౌటపెల్లి సొసైటీ సీఈవో అబ్బురబోయిన వెంకటయ్యను శనివారం సస్పెన్షన్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి తెలిపారు. చౌటపెల్లి సొసైటీ పరిధిలో రుణమాఫీ అయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు మాఫీ అయిన రైతుల నుంచి రైతు వాటాధనం పేరుతో రుసుమును వసూలు చేస్తున్నాడని ఆరోపణలు రావడంతో విచారణ జరిపి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ కుమారస్వామికి ఇన్‌చార్జి సీఈవో బాధ్యతలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

పాపయ్యపేట సొసైటీ గోదాం సేల్స్‌మెన్‌పై వేటు

చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేట సొసైటీ గోదాంలో పని చేస్తున్న సేల్స్‌మెన్‌ను సస్పెండ్ చేసినట్లు డీసీవో సంజీవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని గోదాంలో ఉన్న యూరియాను సేల్స్‌మెన్ మంచాల శ్రీనివాస్ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఓ ప్రైవేటు ఫర్టిలైజర్ షాపునకు అక్రమంగా 78 బస్తాల యూ రియాను తరలించారనే విషయంపై వ్యవసాయ శాఖాధికారులు విచారణ చేపట్టారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లా సహకార సంఘం అధికారులు సేల్స్‌మెన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చుకోవాలి

పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

శంభునిపేట, ఆగస్టు 17: వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులను అవలంబిస్తూ పాడిపరిశ్రమను లాభసాటిగా మార్చుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.బాలాజీ అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో శనివారం పాడి పశువులలో పునరుత్పత్తి పెంచడంపై జిల్లా పశు వైద్య సహాయకులకు ఒక రోజు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి బాలాజీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజన్న మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పాడి పశువుల్లో ఎద లక్షణాలు గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించాలని తెలిపారు. పునరుత్పత్తిలో సరైన పోషణ ద్వారా సమస్యలు తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్ ఆనంద్, జే సాయి కిరణ్, సౌమ్య, రాజు, గణేష్, వరంగల్ జిల్లా పశువైద్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్జించిన జూడాలు

ఎంజీఎం నుంచి కేఎంసీ వరకు భారీ ర్యాలీ, ధర్నా

వైద్య విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితులను శిక్షించాలని నినాదాలు ▸▸ మద్దతు ప్రకటించిన ఐఎంఏ, రాజకీయ పక్షాలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 17: పశ్చిమ బెంగాల్‌లో ఓ వైద్య విద్యార్థినిని అత్యంత క్రూరంగా అత్యాచారంచేసి హతమార్చిన ఘటనపై వరంగల్ నగరంలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. విధులు బహిష్కరించి వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులకు శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నర్సింగ్ విద్యార్థులు, కరీంనగర్‌కు చెందిన వైద్య విద్యార్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో శనివారం ఎంజీఎం నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేఎంసీ ప్రధాన గేటు వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులకు, వైద్య విద్యార్థుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ప్రత్యేక చట్టాన్ని తేవాలని ఐఎంఏ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ కళాశాల అనుమతులకు చేస్తున్న తనిఖీల సందర్భంలో వైద్యులకు రక్షణ కల్పించే విధంగా ఉన్న కళాశాలకే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంజీఎం, కేఎంసీ ఆస్పత్రుల్లో సైతం జూనియర్ వైద్యులకు విశ్రాంతి గదులు, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

ఓపీ సేవలు నిలిపివేత

వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యను ఖండి స్తూ ఇండియల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రవ్యా ప్తంగా పిలుపులో భాగంగా శనివారం వరంగల్ ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్ట డంతోపాటు జిల్లాలోని ప్రయివేట్ ఆస్పత్రులు ఉద యం 6 గంటల నుంచే ఓపీ సేవలు బహిష్కరిం చారు. ఓపీ సేవల బంద్ ఆదివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. రోగుల వైద్య సేవల నిమిత్తం ఎమర్జెన్సీ సేవలను కొనసాగి స్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు



ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యుల కోసం ఓపీ వద్ద ఎదురు చూస్తున్న రోగులు

కొవ్వొత్తుల ర్యాలీ

కోల్‌కత్తాలోని మెడికల్ కాలేజీలో యువ వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు నిరసనగా జూనియర్ డాక్టర్లు శనివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మద్దతుగా వరంగల్‌లోని సోషల్ మీడియా ప్రతినిధులు, పబ్లిక్ గార్డెన్‌కు చేరుకొని ర్యాలీలో పాల్గొన్నారు.



రైలుకింద పడి మహిళకు గాయాలు

రైలు దిగుతుండగా కదలడంతో ప్రమాదం



గాయపడి స్పృహతప్పిన శ్రీదేవి

గిర్మాజిపేట, ఆగస్టు 17: రైలు దిగబోతుండగా రైలు కదిలి కిందపడి ప్రయాణి కురాలు తీవ్రంగా గాయపడిన శనివారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం. శివనగర్‌కు చెందిన శానం శ్రీదేవి (50) తన చిన్న కూతురుతో కలిసి హైదరాబాద్ వెళ్లేందుకు శనివారం ఉదయం శివనగర్ వైపు నుంచి 3వ ప్లాట్‌ఫాం కు చేరుకుంది. శాతవాహన ఎక్స్‌ప్రెస్ 2వ ప్లాట్‌ఫాంపై ఉంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళ్లటానికి బదులుగా 3వ ప్లాట్ ఫాంపై ఉన్న సింగరేణి రైలు ఎక్కి రెండో ప్లాట్‌ఫాం వెళ్లేందుకు ప్రయత్నించారు. ముందుగా కూతురు మీనా సులువుగా రైలు దిగింది. శ్రీదేవి దిగుతుండగా రైలు కదలటంతో రైలు కింద పడింది. ప్రయాణికులు పెద్దగా అరవడంతో సింగరేణిని నిలిపివేశారు. అప్పటికే శ్రీదేవి కుడి కాలుపై నుంచి రైలు వెళ్లడంతో శరీరం నుంచి వేరుపడి స్పృహకోల్పోయింది. రైల్వే పోలీసులు శ్రీదేవి 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

21న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 17: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 21న జాబ్ మేళాను నిర్వహిస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జోషిత గ్రూప్ రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు, జ్యోతి ఎంటర్‌ప్రైజెస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ కంపెనీలో 90 ఉద్యోగాలకు 18 నుంచి 25 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు టెన్త్ ఆపై అర్హతలు, జ్యోతి ఎంటర్ ప్రైజెస్‌లో 15 ఉద్యోగాలకు 18 నుంచి 35 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన పురుష అభ్యర్థులు మాత్రమే ఈ నెల 21న ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళలు ఆర్టీసీని ఆదరించాలి

బాలసముద్రం, ఆగస్టు 17: మహిళలు ఆర్టీసీని ఆదరించాలని, సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను అన్నారు. హనుమకొండ బస్టాండ్‌లో శనివారం డీలక్స్ బస్సులలో ప్రయాణం చేసిన ప్రయాణికుల లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు. లక్కీడ్రాలో గెలుపొందిన మహిళా ప్రయాణికులకు రీజినల్ మేనేజర్ విజయభాను బహుమతులను ప్రదానం చేశారు.



బ్రిడ్జీ పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

నయీంనగర్ బ్రిడ్జి పనులను పూర్తి చేయాలి

కాంట్రాక్టర్లకు మేయర్, కమిషనర్ ఆదేశం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 17: హనుమకొండ నయీంనగర్ వద్ద జరుగుతున్న ప్రధాన రహదారి బ్రిడ్జి నిర్మాణ పనులను మేయర్ గుండు సుధారాణితో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శనివారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని కాంట్రాక్టర్లపై అసహనం వ్యక్తం చేశారు. గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తర్వాత నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వర్టికల్ గార్డెన్, లైటింగ్ ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజయ్య బల్దియా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో వేగం పెంచండి

గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాభివృద్ధి కోసం చేపడుతున్న చాలా పనులు ఇప్పటికే చివరి దశకు చేరుకున్నాయని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా నేడు ర్యాలీ



మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

నర్సంపేట టౌన్, ఆగస్టు 17 : బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాల యాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నేడు (ఆదివారం) నర్సంపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్యవేదిక నాయకులు పంజాల వెంకట్ గౌడ్, తవుటు రమేష్‌లు తెలిపారు. ర్యాలీపై నర్సంపేట ఏసీపీ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ర్యాలీ ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగుతుందని, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనికోరారు. కార్యక్రమంలో మల్యాల రవి, కొంపల్లి రాజు, వేల్పుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రౌండ్‌టేబుల్ సమావేశానికి

మరియపురం

• నేడు జూమ్ మీటింగ్‌లో పాల్గొనున్న మాజీ సర్పంచ్ బాలిరెడ్డి



బాలిరెడ్డి

గీసుగొండ, ఆగస్టు 17 : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురానికి అరుదైన అవకాశం లభించింది. 18న రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా తిరుపతిలో అకాడమి ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టడీస్ అండ్ రీసర్చ్ ఆఫ్ ఇండియా(అగ్రశ్రీ) జాతీయ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు గ్రామ మాజీ సర్పంచ్ బాలిరెడ్డి, గ్రామ కార్యదర్శికి ఆహ్వానం లభించింది. 21వ శతాబ్దంలో జాతీయ గ్రామీణాభివృద్ధి భారతదేశ దార్శనికతపై పలువురు మేధావులు, వైస్ చాన్సలర్స్, నిట్ ప్రొఫెసర్‌లు, నిర్డ్ అధికారులు పాల్గొని వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని కేంద్ర పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి మణిశంకర్ అయ్యర్, సెంట్రల్ ప్లానింగ్ కమిటీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా హాజరై ప్రారంభోపన్యాసం ఇస్తారని చెప్పారు. జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించే ఈ సమావేశంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గ్రామాలను ఎంపిక చేయగా అందులో మరియపురం ఎన్నిక కావటం విశేషం. ఇందులో బాలిరెడ్డి అర్ధగంట గంటపాటు గ్రామాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, ఎదురైన సమస్యలు, సాధించే లక్ష్యాలు, 21వ శతాబ్దంలో గ్రామాల సాధికారత, స్థితిగతులు వంటి అంశాలపై ఆయన వివరించనున్నారు. కాగా, అగ్రశ్రీ పురస్కారానికి ఎంపికైన బాలిరెడ్డిని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఆదివారం జరిగే అగ్రశ్రీ సమావేశం కొరకు గ్రామంలో భారీ డిజిటల్ స్ర్కీన్‌ను ఏర్పాటు చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



సదయ్య (ఫైల్)

సంగెం, ఆగస్టు 17 : బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన తీగరాజుపల్లిలో శనివారం జరిగింది. ఎస్సై నరేష్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సూత్రపు సదయ్య (55) తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించుకునేందుకు బంక్ వద్దకు వెళ్తున్నాడు. అదే సమయంలో వరంగల్‌లోని కరీమాబాద్‌కు చెందిన కొక్కొండ నిఖిల్ వరంగల్ వైపు వెళ్తూ తన ద్విచక్రవాహనంతో వెనకనుంచి వేగంగా వచ్చి సదయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో సదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సదయ్య సెలూన్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన 'కొండా'

గీసుగొండ, ఆగస్టు 17 : వంచనగిరి గ్రామ మాజీ ఉప సర్పంచ్ పీసాల రాజేశ్వర్‌రావు రెండు రోజుల క్రితం మృతిచెందగా, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు రాజేశ్వర్‌రావు కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, రడం భరత్, కొండా వెంకన్న, శ్రీను, రాజు పాల్గొన్నారు.

పాపయ్యపేట సొసైటీ గోదాం సేల్స్‌మెన్ సస్పెన్షన్

చెన్నారావుపేట, ఆగస్టు 17 : మండలంలోని పాపయ్యపేట సొసైటీ గోదాంలో పని చేస్తున్న సేల్స్‌మెన్‌ను సస్పెండ్ చేసినట్లు డీసీవో సంజీవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని గోదాంలో ఉన్న యూరియాను సేల్స్‌మెన్ మంచాల శ్రీనివాస్ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఓ ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణానికి అక్రమంగా 78 బస్తాల యూరియాను తరలించారనే విషయంపై వ్యవసాయ శాఖాధికారులు విచారణ చేపట్టారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లా సహకార సంఘం అధికారులు సేల్స్‌మెన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీచేసినట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

చౌటపెల్లి సొసైటీ సీఈవోపై వేటు

పర్వతగిరి, ఆగస్టు 17 : మండలంలోని చౌటపెల్లి సొసైటీ సీఈవో అబ్బరబోయిన వెంకటయ్యను శనివారం సస్పెన్షన్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి తెలిపారు. చౌటపెల్లి సొసైటీ పరిధిలో రుణమాఫీ అయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు మాఫీ అయిన రైతుల నుంచి రైతు వాటాధనం పేరుతో రుసుమును వసూలు చేస్తున్నాడని ఆరోపణలు రావడంతో విచారణ జరిపి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ కుమారస్వామికి ఇన్‌చార్జి సీఈవో బాధ్యతలను అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఫిరంగిగడ్డలో గొర్రె, పొట్టేళ్ల చోరీ

వర్ధన్నపేట, ఆగస్టు 17 : వర్ధన్నపేట పట్టణ శివారులోని ఫిరంగి గడ్డలో ఐదు గొర్రె పొట్టేళ్ల చోరీ అయిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు కందుగుల రాజు తెలిపిన వివరాల ప్రకారం... రాజుకు ఉన్న గొర్రె మంద నుంచి గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి ఐదు గొర్రె పొట్టేళ్లను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరో రెండు గొర్రెల మందల నుంచి గొర్రెపొట్టేళ్లను దుండగులు ఎత్తికెళ్లినట్లు సమాచారం. బాధితులు ఇప్పటి వరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు.

తుమ్మల కుంట చెరువు శిఖంపై విచారణ



చెరువు శిఖం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

నల్లబెల్లి, ఆగస్టు 17: మండలంలోని గోవిందాపూర్ జీపీ పరిధిలో శంషాబాద్ గ్రామ శివారులోని తుమ్మలకుంట చెరువు శిఖం రెండున్నర ఎకరాల భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం స్థానిక పోలీసులు తుమ్మలకుంట చెరువు శిఖంకు చేరుకుని చెరువును మొత్తం పరిశీలించారు. అనంతరం ఆయకట్టు రైతుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ తదుపరి చెరువు కబ్జా చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ పరిశీలనలో స్థానిక పోలీసులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య మిత్రులు

చెన్నారావుపేట, ఆగస్టు 17 : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన బాకీ సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, చిన్ననాటి బాల్య మిత్రులు శనివారం ఆర్థిక సాయాన్ని అందించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అందరూ కలిసి రూ.25,500లను బాధిత కుటుంబానికి అందించారు. ఎర్ర రవీందర్, వీరేందర్‌రెడ్డి, కత్తి కుమారస్వామి,అనుముల సుధాకర్, పాలకుర్తి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు!

మత్తు పదర్థాల నిర్మూలనే లక్ష్యంగా అవగాహన

విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భాగస్వామ్యం

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 17 : ప్రభుత్వం మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులతో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. పిల్లలతో పాటు పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు అవగాహన తెచ్చుకోవాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇల్లంద, నల్లబెల్లి, ఉప్పరపెల్లి గ్రామాల్లో సివిల్, ఎక్సైజ్ అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం

హనుమ వేణు, హెచ్‌ఎం, ఉప్పరపెల్లి పాఠశాల

పాఠశాలలో ప్రహరీ క్లబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి. దీనిపై పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సమావేశమై మరికొన్ని రోజుల్లో కమిటీని ప్రకటిస్తాం. మత్తు పదార్థాల నిర్మూలన కోసం తమవంతుగా నడుం బిగిస్తాం.

కమిటీ ఇలా..

మత్తు పదార్థాల నిర్మూలనకు ఏర్పాటు చేసే ప్రహరీ కమిటీ చైర్మన్‌గా పాఠశాల హెచ్‌ఎం, వైస్ చైర్మన్‌గా సీనియర్ ఉపాధ్యాయుడు, 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు, స్థానిక పోలీసు స్టేషన్‌కు చెందిన సిబ్బంది ఒకరు, పిల్లల తల్లిదండ్రుల నుంచి ఒకరు కమిటీ సభ్యులుగా ఉంటారు. త్వరలో కమిటీల నిర్మాణం పూర్తి చేసి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. క్విజ్, పోస్టర్ మేకింగ్, వ్యాసరచన, ఉపన్యాసం తదితర రూపాల్లో అవగాహన కల్పిస్తారు.



ఉప్పరపెల్లి ప్రభుత్వ పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ స్వరూప (ఫైల్)

మూడు నెలలకోసారి..

ప్రహరీ క్లబ్‌కు ఎంపికైన విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఇందులో ఉదాహరణలతో సహా వివరిస్తారు. వీరు పాఠశాలల్లో తోటి వారికి అవగాహన కల్పిస్తారు. ప్రతీ మూడు నెలలకోసారి క్లబ్ సభ్యులు సమావేశమై చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చిస్తారు. గత నెలలో రాష్ట్ర స్థాయిలో అవగాహన సమావేశం జరిగింది.

కొనుగోలుదారులతో రాఖీ షాపుల సందడి



రాఖీ షాపుల వద్ద కొనుగోలుదారులు

నర్సంపేట, ఆగస్టు 17 : అనుబంధాలను పంచుకునే పండుగ రాఖీ పండుగ. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల అన్యోన్యతకు, ప్రేమానురాగాలకు చిహ్నం ఈ పండుగ. పండగరోజు సోదరీమనులు తమ అన్నదమ్ములకు రాఖీ కట్టి వారి ఆశీర్వాదం పొందడం ఆనవాయితీగా వస్తుంది. ఎంతదూరంలో ఉన్నా, పేద, ధనిక అనే భేదం లేకుండా రాఖీ పండగ కంటే రెండు రోజల ముందే మెట్టింటి నుంచి పుట్టింటికి చేరుకుంటారు. మెట్టింటి నుంచి పుట్టింటికి వచ్చే మహిళలతో గ్రామాలు, పట్టణాల్లోని ప్రతీ ఇల్లు సందడిగా మారుతుంది. పండుగను పురస్కరించుకుని రాఖీ పౌర్ణమి రోజున తమ సోదరులకు కట్టేందుకు రాఖీలు కొనుగోలు చేస్తున్నారు.పట్టణంలోని బస్టాండు సెంటర్, నెక్కొండరోడ్, అంగడిసెంటర్, పాఖాలరోడ్ ప్రాంతాలలో రాఖీల షాపులను ఏర్పాటు చేశారు. రూ.10 నుంచి రూ.500 ధరపలికే వివిధ రకాల డిజైన్ల రాఖీలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కొనుగోలు దారులతో రాఖీ షాపులు కిటకిటలాడుతున్నాయి.

బస్టాండ్ కిటకిట

రాఖీ పండుగ సందర్భంగా పొరుగు ప్రాంతాల్లోని మెట్టింటి నుంచి పుట్టింటి వచ్చిపోయే మహిళలతో నర్సంపేట బస్టాండ్ కిటకిట లాడుతోంది. సోమవారం రాఖీ పండుగ జరుగుతుంది. అన్నదమ్ములకు రాఖీ కట్టి వారి ఆశీస్సులు పొందడానికి వచ్చే మహిళలు వారి కుటుంబ సభ్యులతో శనివారం బస్టాండ్ సందడిగామారింది. ఆదివారం రోజు పెద్ద సంఖ్యలో వచ్చిపోయే మహిళలతో బస్టాండ్ మరింత సందడిగా మారనుంది. వరంగల్, హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబాబాద్, ఖమ్మం, ఇల్లంద, కొత్తగూడెం, భద్రాచలం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్ళే బస్సులన్నీ నిండుగా కనిపిస్తున్నాయి.

పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

ఖానాపురం, ఆగస్టు 17: మండలంలోని మంగళవారిపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో లీడ్‌లైబ్రరీ ఆధ్వర్యంలో జాయిన్ హ్యాండ్స్ 07 ఫౌండేషన్ వారు శనివారం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కవి, గ్రంథాలయ ఉద్యమకర్త కాసుల రవికుమార్-శోభారాణి దంపతులు హాజరై గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంపై గెలుపొందడానికి అక్షరాన్ని మించిన ఆయుధం లేదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

నర్సంపేట, ఆగస్టు 17: పట్టణంలోని పాఖాలరోడ్‌లోని మాడల్‌స్కూల్‌లో ఓపెన్ స్కూల్‌లో ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో చేరడానికి ఆగస్టు 31వ తేది వరకు అడ్మిషన్లు పొందాలని పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారి అన్నారు. పట్టణంలోని పాఖాలరోడ్‌లో గల పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో ఎస్ఎస్‌సి, ఇంటర్ హెచ్‌ఈసి, సీఈసీలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసికొని సంబంధిత రిసిప్ట మాడల్ పాఠశాలలో అందించాలన్నారు. వివరాల కోసం తన సెల్ నంబర్ 9441681641, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కుమారస్వామి 9640162614కు సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, మాడల్ స్కూల్ హెచ్‌ఎం శాంతకుమారి సూచించారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలందిస్తామన్నారు.

రేపు సంతోషిమాత జయంతి

నర్సంపేట, ఆగస్టు 17: పట్టణంలోని సర్వాపురం సంతోషిమాత ఆలయంలో మాత జయంతి వేడుకలను ఈనెల 19 నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు గట్టు నారాయణాచార్యులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంతోషిమాత జయంతిని పురస్కరించుకొని ఆలయంలో పంచామృతాభిషేకం, పుష్పార్చణ, కుంకుమార్చన, హైగ్రీవాస్వామికి తులసిమాలతో లక్ష్మీమాతకు అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు జరుగు తాయన్నారు. ఇదేరోజు వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీవిష్ణుసహ స్రనామ పారాయణం, గణపతి హోమం, సంతోషిమాత హోమం, శ్రీహైగ్రీవలక్ష్మి హోమాలు జరు గుతాయని తెలిపారు. ఈ పూజాకార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రంగనాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన నిరసనలు

మెడికోపై హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



నర్సంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ వైద్యులు



వర్ధన్నపేటలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సంపేట టౌన్, ఆగస్టు 17 : కోల్‌కత్తాలో పీజీ రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న వైద్య విద్యార్థిని మోమిత దేవరాత్‌ను అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనపై శనివారం నర్సంపేట లో నిరసనలు వెల్లువెత్తాయి. నర్సంపేట ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో వైద్యులు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి ఐసీడీఎస్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐక్య విద్యార్థి సంఘాలు సంఘీభావం తెలిపాయి. ర్యాలీ అమరవీరుల స్థూపంనుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు భారతి, సుజాతరాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట :పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆర్‌ఎంవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. పీజీ వైద్య విద్యార్థినిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, నర్సులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

• నెక్కొండ : నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు నిధితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రహేలతన్వీర్ కోరారు.కార్యక్రమంలో వైద్యసిబ్బంది అరుణ, వరమ్మ, సంజీవ్, స్వప్న, అజహర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గ్రామీణ వైద్యులు వైద్య సేవలను బంద్ చేశారు.

• చెన్నారావుపేట : నిందితుడిని కఠినంగా శిక్షించాలని వైద్యాధికారి డాక్టర్ సరోజ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భద్రయ్య, బెలుహ, సురేందర్, లింగమూర్తి, రాణి తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవద్ద డాక్టర్ కిరణ్‌రాజు, వైద్య సిబ్బంది కలసి నల్లబ్యాడ్జీలతో నిరసనతెలిపారు.హెచ్‌ఈవో సాంబయ్య, హెచ్ఎస్ సలోమి,సరిత, సిబ్బంది ఉన్నారు.

రావికుంట చెరువు మత్తడి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట, ఆగస్టు 17 : మండలంలోని జల్లి గ్రామ శివారులోని రావి కుంట చెరువు మత్తడీని ధ్వంస చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘ నాయకులు కాట కుమారస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 110లో ఉన్న 23ఎకరాల 15 గుంటల భూమిని కొన్ని సంవత్సరాలు అక్రమంగా పట్టాలు చేసుకొని సాగు చేస్తున్నారన్నారు. గ్రామంలోని చెరువుపై 100 మంది రైతు, మత్స్యకార్మిక కుటుంబాలు ఆధారపడి ఉన్నారన్నారు. చెరువులో నీటి నిల్వ లేకుండా మత్తడిని ధ్వంసం చేసి చెరువు శిఖంలో అక్రమంగా సాగు చేస్తున్నవారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం, ఆగస్టు 17: సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మల్యాల అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బుధరావుపేట, ధర్మరావుపేట గ్రామాల్లో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇండ్లలో దోమల నివారణ మందులను, మురుగు గుంటల్లో, నీరు నిలువ ఉన్నచోట యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా తిమోఫాస్ స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేశారు. వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, సునీత, రాజయ్య, భాస్కర్, దామోదర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పర్వతగిరి, ఆగస్టు 17 : మండలంలోని చింతనెక్కొండకు చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్ తల్లి సరోజన అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలి

చెన్నారావుపేట, ఆగస్టు 17: విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లాసెక్టోరియల్ అధికారి కె.సుభాష్ అన్నారు. శనివారం మండలంలోని కోనాపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగ్ నిర్వహించాలన్నారు. ప్రతీ విద్యార్థి పాఠశాలకు విధిగా హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆలోచనలు మార్చేలా విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనుపాటి పాపమ్మ, శ్రీనివాస్, కిషోర్, అంజనేయులు.అజాం, సుష్మా, సంపత్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమానం

దుగ్గొండి, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 10/10 మార్కులు సాధించిన 8మంది విద్యార్థులకు తెలుగు భాషోపాధ్యాయురాలు కూరపాటి సుశీల ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ప్రోత్సాహక బహుమానం అందించారు. హెచ్‌ఎం రామస్వామి మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులను చదువులో రాణించడానికి ఉపాధ్యాయురాలు సుశీల ప్రోత్సహించారన్నారు. అనంతరం పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. అలాగే మండలంలోని మల్లంపల్లి ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించగా హెచ్‌ఎం భద్రమ్మ పాల్గొని మాట్లాడుతూ పిల్లల చదువుకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు దేవేందర్, అజీజ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోగా గోపాల్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



చెన్నారావుపేట. ఆగస్టు 17: చెన్నారావుపేట మండల వ్యవసాయశాఖ అధికారిగా గోపాల్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్‌లోని భూసార పరీక్ష ల్యాబ్‌లో పని చేస్తున్న గోపాల్‌రెడ్డి బదీలీపై వచ్చారు ఇక్కడ ఇన్‌చార్జీ ఏవోగా పని చేస్తున్న శశికుమార్ బదిలీపై వెళ్లారు. పలువురు నూతన ఏవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పీఏసీఎస్ పాలక వర్గాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న మహ్మద్ రాజాసాహెబ్

నల్లబెల్లి, ఆగస్టు 17: రుణమాఫీ ప్రక్రి యలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నల్లబెల్లి పీఏసీఎస్ పాలకవర్గాన్ని వెంటనే రద్దుచేయాలని ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీలో అక్ర మాలకు పాల్పడడం సరైంది కాదన్నారు. పీఏసీఎస్‌లో సమగ్ర విచారణ జరిపి అవినీతి చేసిన దోషులను తక్షణ మే శిక్షించాలన్నారు. అలాగే ఫిర్యాదుదారులను బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామ సాంబయ్య, మంద సంజీవ, శ్రీధర్, బాబు, సుధారాణి, ఐలయ్య పాల్గొన్నారు.

బాలుతండా జీపీగా ఏర్పాటుపై సంబరాలు



బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఖానాపురం, ఆగస్టు 17: మండలంలోని ధర్మరావుపేట శివారులోని బాలుతండా నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటుపై శనివారం తండాలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు. తండాను జీపీగా ఏర్పాటు చేసినందుకు గాను మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం గ్రామ దేవత బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. అదేవిధంగా బాలుతండా గ్రామ పంచాయతీగా ఏర్పాటు కావడానికి కృషిచేసిన మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మాజీ జడ్పీటీసీ బత్తిని స్వప్నశ్రీనివాస్‌గౌడ్‌లకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రనాగుల మంగ్యా బోడ వెంకన్న, భూక్య భావ్‌సింగ్, బానోతు వీరన్న, గుగులోతు శ్రీను, వెంకన్న, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ విషయమై ఎంపీడీవో భారతిని వివరణ కోరగా బాలుతండా గ్రామ పంచాయతీగా ఏర్పాటుపై ఎంపీడీవో కార్యాలయానికి ఎలాంటి జీవో అందలేదని తెలిపారు.

ముదురు నారులో జాగ్రత్తలు పాటించాలి

వెదజల్లే పద్ధతితో ఎంతో మేలు

కాలిబాటలు వేసుకోవాలి



రాయపర్తి, ఆగస్టు 17: ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో వరి నాట్లు చివరిదశకు చేరుకున్నాయి. ఎగువన కురిసన వర్షాలతో చెరువుల్లో సైతం కొంత మేర నీరు చేరడంతో బోరు బావుల కింద వేసిన వరి నారు ఆలస్యం కావడంతో ముదురుతోంది. ఈ పరిస్థితుల్లో ముదురు నాటు నాటాల్సి వస్తోంది. ముదురు నాటు నాటాల్సివస్తే రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఇలా చేయాలి...

ఆయకట్టు ప్రాంతాల్లో కొన్నిచోట్ల వరినారు దొరకకపోవడంతో నాట్లు ఆలస్యమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముదు రునారు నాటాల్సి వస్తోంది. అలాంటి సమయంలో రైతులు తగిన మెళకువలు పాటించాలి. సాగుచేసేరకాన్ని బట్టి ఎంత వయసు ఉన్న నారు మొక్కల్ని నాటుకోవచ్చు అనే విషయాన్ని రైతులు తెలుసుకోవాలి.దీర్ఘకాలిక వరి వంగాలైతే నారు వయసు 30-45రోజుల వరకు ఉండవచ్చు. మధ్యకాలిక కృష్ణ ఎంటీయూ 1001 జగిత్యాల మసూరి, ఆర్ఎన్ఆర్ 15048 తెలంగా సోనా వంటి రకాలకు సంబంధించి 30-40రోజులు వయసుఉండవచ్చు. స్వల్పకాలిక రకాలు 1010, తెల్లహంస, కేఎస్ఎమ్ 118, ఎన్ఎల్ఆర్ 34449 రకాలైతే 25-35 రోజుల వరకు ఉండవచ్చు. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి వానాకాలంలో దీర్ఘకాలిక రకాలు చదరపు మీటరుకు 33మూరలు ఉండాలి.నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30సెంటీ మీటర్ల కాలిబాటలు తీయాలి. కాలిబాటల వల్ల గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు, వేసుకోవడానికి కాలిబాటలు ఉపయోగపడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ముదురు వరి నారు నాటాల్సి వస్తే కుదురుల సంఖ్యలో పెంచుకోవాలి. ఒక్క కుదురుకు 5-6 మొక్కలు నాటుకోవాలి. నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మోతాదుకంటే 25 శాతం పెంచాలి. సాధారణంగా నత్రజని ఎరువులను మూడు దఫాలుగా వేస్తారు. పొలంలో ముదురు నారు నాటినప్పుడు రెండు దఫాలుగా సిఫారసు చేసిన మోతాదులో 70శాతం దమ్ములోను, మిగిలిన 30శాతం అంకురం దశలోను వేసుకోవా లి. వరి నాటు నాటేటప్పుడు నారు కొనలు తుంచి నాటుకోవా లి. తల్లి పురుగులు గుడ్లు వరి నారు కొనల మీద పెడుతాయి. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలు తుంచుకోవడం వల్ల ఈ పురుగుల గుడ్లను నిర్మూలించవచ్చు. దీంతో పాటు ముక్కి పురుగు, కాండం తొలుచు పురుగు, తెల్ల కంకులు రాకుండా కూడా నివారించవచ్చు.

రైతులు సూచనలు పాటించాలి..

వీరభద్రం, ఏవో, రాయపర్తి

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. రైతులు ఈ సమయంలో 125 రోజులు స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి. వరినారు లేని రైతులు దమ్ము చేసుకుని వెదజల్లే పద్ధతి ద్వారాగానీ, సీడ్ డ్రిల్ ద్వారా గాని విత్తుకోవచ్చు. పొడి దుక్కిలో కూడా వెదజల్లుకోవచ్చు. సీడ్ డ్రిల్ ద్వారా కూడా విత్తుకోవచ్చు.

రోడ్డు పక్కనే మొక్కలు

• అభ్యంతరం చెప్పినా పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కనే నాటిన మొక్కలు



ఎండుతున్న మొక్కలు

చెన్నారావుపేట, ఆగస్టు 17 : మండలంలోని శంకరంతండాలో, హరిత హారం, వన మహోత్సవంలో భాగంగా రోడ్డు పక్కనే మొక్కలు నాటుతున్నారని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని శంకరంతండా నుంచి బాపునగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి రోడ్డుకు ఇరుపక్కలా ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో రోడ్డు పక్కనే 2,500 పైగా మొక్కలు నాటారని, రానున్న రోజుల్లో రోడ్డు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలకు ఎలాంటి రక్షణ లేక పోవటంతో మేకలు. పశువులు తింటున్నాయని, నీళ్లు కూడా పోయకపోవడంతో సగానికి పైగా ఎండి పోయాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ కార్యదర్శి ప్రమీలకు ఇదే విషయమై మొక్కలను రోడ్డు పక్కనే నాటవద్దని అభ్యంతరాలు చెప్పామన్నారు. అయినా అధికారులు పట్టించుకోకుండా రోడ్డు పక్కనే మొక్కలను నాటుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించి మొక్కలను రోడ్డుకు దూరంగా నాటించడానికి చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి ప్రమీలను వివరణ కోరగా.. మొక్కల రక్షణ కోసం చర్యలు చేపట్టడం జరగుతుందని, రోడ్డుకు పక్కనే స్థలం లేక పోవటంతోనే కొంచెం దూరంగా మొక్కలను నాటుతున్నామన్నారు.